
కొత్త సీరియల్ ప్రారంభం

# సహగమనం



## మధురాంతకం నరేంద్ర

నుదుటిపైని కుంకుమబొట్టును గుండ్రంగా దిద్దుకున్నాక, నిలువుటద్దంలోని తన ప్రతిబింబాన్ని రెండు మూడు నిముషాలసేపు పరీక్షించి చూసుకొంది మానస.

వలుచటి పౌడరుపూతతో ముఖం మంచు తెరను కప్పుకున్న గులాబీలా కాంతులీనుతోంది. ట్రిమ్ చేయించిన కనుబొమలు పందెపు కోళ్ళకు కట్టిన చురకత్తుల్లా కవ్విస్తున్నాయి. ప్రెస్సింగ్ ముక్కు ఫుల్లపైబడి, జిగేల్మని మెరిసిన కాంతి కిరణం, పెదవులపైని లేత గులాబిరంగు లిప్‌స్టిక్ పూతపై ప్రతిఫలిస్తోంది. జూకాలు కంఠహారంతోనూ, గాజులతోనూ 'మాచ్' అయ్యాయి. పై కెగసిన సముద్రపుకెరటాల్ని కిందికి పడనివ్వకుండా అలాగే వొడిసి పట్టుకున్నట్టున్న పీలిరంగు అద్దండి చీరకు కుచ్చిళ్ళు చక్కగా అమరాయి. వోసారి చీర కుచ్చిళ్లు పైకెత్తి పాదాలకేసి చూసుకొంది. ముదురు వంకాయ రంగు నెయిల్ పాలిష్‌తో వేళ్ళు 'ఫాషన్ పారేడ్‌కు' సిద్ధమయినట్టుగా కనిపిస్తున్నాయి. వెండి మెట్టెలకు మూడు చిరుమువ్వలున్న కొక్కెం వేలాడుతోంది.

చీర పయిటను వోసారి సవరించుకున్న తరువాత నువ్వేమంటావన్నట్టుగా కనుబొమలెగరేస్తూ ప్రతిబింబాన్ని పలకరించింది. "అంతా సక్రమంగానే వుంది"— అంటూ తానూ కళ్ళెగరేసింది ఆమె ప్రతిబింబం.

తన చేష్టలను చూసి, తనకుతానే నవ్వుకుంటూ గోడ గడియారం కేసి చూసింది. కింది వైపుకు ఒరిగి నిల్చున్న గడియారపు ముళ్లు రెండూ ఆమె అలంకరణ చూడడంకోసం పోటీ - పడుతున్నట్టుగా కనిపించాయి.

కిటికీలోంచి వీధివైపుకు తొంగిచూసింది ఆమె..

జరుగుతున్నది చలికాలం కావడంతో వీధుల్లో ఆరున్నర గంటలకంతా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి.

టేప్ రికార్డర్ ఆన్ చేసి, వారపత్రిక నొకదాన్ని చేతబట్టుకుని, సోఫాలో కూర్చొంది. మానస.

యెదురుగా కిటికీలోంచి కాంపౌండువాల్ కున్న గేటు స్పష్టంగా కనిపిస్తోంది చేతిలోని పత్రికపైన ఆమె మనస్సు నిలవడం లేదు. రెండు నిముషాల


Rao

కొకసారి కిటికీవైపుకు చూడక తప్పడం లేదు.

పట్టెమంచం ప్రక్కనున్న టీపాయ్‌పైకి చూసింది ఆమె.

'స్టీలు ఫ్రేం తగిలించుకున్న పెళ్ళినాటి ఫోటోలో చిరంజీవి నవ్వుతూ కనిపించాడు. తలకు పాగా, పట్టు అంగవస్త్రం, పూలమాల— ఆ వేషంలో తమాషాగా కనిపిస్తున్నాడతను. అతని పక్కనే తాను. రాత్రంతా నిద్ర మేల్కొన డంతో ఎర్రబారిన కళ్ళు, నుదుటంతా అలుక్కుపోయిన కుంకుమా కాటుకా, బుగ్గపైన పెద్దచుక్కా, చుట్టూ మనుషులు గుమికూడిపోయి గాలి వీచక పోవడంచేత ముఖంపైన చెమట బిందువులూ— తనకప్పుడు యిప్పటిలా శ్రమపడి అలంకరణ విషయంలో శ్రద్ధ తీసుకునే అవకాశం లేదు. అయినా తాను అందం గానే వుంది. ఆ విషయాన్ని చిరంజీవి సైతం వొప్పుకుంటాడు. అలాగని అలానే తయారై కూచుంటే అతడు సహించలేడు. అసలు హనీమూన్ కోసమని బెంగుళూరు కెళ్ళిన మొదటి రోజున, అతడు చేసిన మొదటిపని- తనను 'బ్యూటీ పార్లర్' కు తీసుకెళ్ళడమే !,

వారపత్రికను టీపాయ్‌పైకి విసిరేసి కిటికీలోంచి కనిపిస్తున్న ఆకాశపు శకలాన్ని చూస్తూ కూర్చొంది మానస.

రోడ్డుపైన ఆటోలూ, బస్సులూ దీపాలు వెలిగించుకుని అట్టహాసం చేస్తున్నాయి.

కాంపౌండువాల్ కివతలున్న క్రోటన్ మొక్కలపైన వీధి దీపాలకాంతి పడటంతో అక్కడొక రంగు రంగుల మాడరన్ ఆర్ట్‌పీస్ ప్రత్యక్షమయ్యింది.

మేడక్రింద, వంటగదిలోంచీ కుక్కర్ శబ్దం వినిపిస్తోంది.

గదిలోని ట్యూబులైటు కాంతి, వెన్నెలతో పోటీకోసం సిద్ధమై కూర్చొంది.

పెళ్ళయి ఆరునెలలు పూర్తికావస్తున్నా ఆ గదీ, ఆ వాతావరణమూ, ఫోటో ఫ్రేంలోంచీ నవ్వుతోన్న చిరంజీవి -ఫోటో- అన్నీ యింకా కలలాగే అనిపిస్తోంది ఆమెకు.

చిరంజీవి సాన్నిధ్యంలో వున్నప్పుడు సైతం ఆమెకు దాదాపు యిలాంటి అనుభూతే కలుగుతూ వుంటుంది. నిద్రలేచిన తరువాత స్పష్టాస్పష్టంగా గుర్తుకొచ్చే కలలోని సంఘటనల్లా ఆమె పుట్టిల్లు జ్ఞాపకానికొచ్చేది,

మానస పుట్టిల్లు అత్తవారింటి నుంచీ పదిహేనుమైళ్ళ దూరంలో వుంది. అలాగని ఆమె పుట్టిల్లు మరోవూరు కాదు. దాదాపు పాతికమైళ్ళ మేరకు వ్యాపించిన నగరంలో వొకచివరన ఆమెపుట్టిల్లు, మరోవైపున అత్తవారిల్లూ వున్నాయి వున్న వొక్కగానొక్క కూతురినీ పెళ్ళిచేసి పంపేయడంతో ఆమె తల్లిదండ్రులకు కూడా తమయిల్లు బోసిపోయినట్లుగా స్పష్టంగానే కనిపిస్తోంది. తలచుకున్నప్పుడల్లా వాళ్ళిద్దరూ వచ్చి చూసి వెళ్తూనే వున్నారు. రోజుకోసారైనా పుట్టింటి నుంచీ ఫోన్ మోగుతూనే వుంటుంది. ఆమె అన్నయ్యనెక్కించుకున్న 'రాజ్‌దూత్' రెండు మూడు రోజులకోసారి కాంపౌండు వాల్ తలుపుల్ని దాటి లోపలికి ప్రవేశిస్తూనే వుంటుంది. వాళ్ళను కలిసినప్పుడూ, ఫోన్‌లో పలకరిస్తున్నప్పుడూ, యీ రెండు కలలనూ కలుపుతున్న వారధిలాంటి పెళ్ళీ, తీయటి స్మృతిలా మిగిలిపోయిన పెళ్ళిచూపుల తతంగమూ, మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం వస్తూనే వున్నాయి.

టేప్ పూర్తవడంతోనే బటన్ టక్కుమని పైకి లేచింది.

కాసెట్ తిప్పిపెట్టి, బటన్ నొక్కి, మళ్ళీ వారపత్రికను చేతిలోకి తీసుకొంది మానస.

టెలిఫోను రింగుమంది.

పట్టెమంచం దగ్గరికి వెళ్ళి, టీపాయ్‌పైనున్న టెలిఫోన్ రిసీవర్ని అందుకుంటూ "హలో...." అంది

"నేనండీ... రాజేష్‌ను..." రాజేష్ మాట్లాడుతున్నాడు.

"నమస్తే !... "

"హలో అని ఇంగ్లీషులో విష్ చేసింది చాలక తెలుగులో కూడా నమస్కరించాలా చెప్పండి ?... " నవ్వుతున్నాడతను.

మానసకు చిరాకేసింది.

మౌనంగా వుండిపోయింది.

"కోపం వచ్చిందా ? తమాషాకలా అన్నానండోయ్... "

యెదుట నిలబడి చూస్తున్నట్టుగా యెలాకనిపెట్టేశాడితను ? ఆమెకు ఆశ్చర్యం కలిగింది. బలవంతంగా చిరునవ్వును కొని తెచ్చుకొని " అబ్బే లేదు..." అంది.

"నాకు తెలుసులెండి మీకు కోపం వచ్చినట్టుంది."

"లేదంటున్నాను గదా ! "

"నిజం... ?"

"నిజం ..." మళ్ళీ చిరాకు పడింది ఆమె.

"చూశారా, యీసారి మీకు నిజంగానే కోపం తెప్పించ గలిగాను మళ్ళీ నవ్వసాగాడు.

రిసీవరును విసిరి పారేయాలనిపించింది. ఆమెకు.

ఫోన్ పెట్టేసేయకండి..." అన్నాడతను.

"అబ్బే లేదు... " ఆమె తడబడి పోయింది.

"క్లబ్ నుంచీ ఫోన్ చేస్తున్నాను. సాగర్ యిక్కడే వున్నాడు..."

"యేం చేస్తున్నాడు ?.... "

" యీ రోజెలాగైనా, వోసెట్టయినా నన్నోడించాలనుకొని ట్రైచేసి చేతులు పైకెత్తేసి, ముఖం కడుక్కోవడం కోసం టాయిలెట్‌లో కెళ్ళాడు. యిద్దరమూ యిప్పుడే టెన్నిస్ కోర్టునుంచీ క్లబ్బులో కొచ్చాం. మీకు ఫోన్ చేయాలన్నాడు నాతో. నేను రింగ్ చేసి మాట్లాడుతూ వుంటాను, యీలోగా ముఖం కడుక్కుని రమ్మని చెప్పాను."

మానస మంచంపైన కూర్చొంది.

"చిరంజీవి... ?"

"యింకా రాలేదు...."

"యివ్వాళ క్లబ్‌కు గూడా రాలేదు.... అన్నట్టు మీ అన్నయ్య చిరంజీవితో గూడా పోటీ పడ్డాడు. వస్తే ఓసెట్టయినా లాగించాలని యెదురు చూసీ చూసీ, పాపం డిసప్పాయింటయి పోయాడు...."

"... ...."

"చిరంజీవి ఎక్కడికెళ్ళినట్టు ? యింకా ఫ్యాక్టరీలోనే కూచున్నాడా ?"

"వుండొచ్చు. యేదో పనుందని ఉదయం చెప్పారు గూడా...."

యింకా సాగర్ టాయిలెట్‌లోంచీ బయట పడలేదు. యేవయినా విశేషాలు చెప్పండి...."

"యేమున్నాయి ? ... "

"అంకుల్ .... ?"

"రామకృష్ణ మందిరానికెళ్ళారు...."

సేమ్ వోల్డ్ రొటీన్... మరి ఆంటీ... ?"

' సేమ్ వోల్డ్ డ్యూటీ... వంట..."

"పరవాలేదండీ, మీరు మాట్లాడడం నేర్చుకుంటున్నారు. అంతా చిరంజీవి ఘనతే ! ఆరునెలలు సావాసం చేస్తే వాళ్ళు వీళ్ళవుతారట గదా ! " రాజేష్ నవ్వసాగాడు.

"మీరేం చేస్తున్నారు ? ... "

"యెప్పుడు ? "

"ఫోన్ రింగయినప్పుడు...."

టేప్ వింటూ కూచున్నాడు. అన్నయ్యింకా రాలేదా ?..."

"యిదుగో వచ్చేస్తున్నాడు. బోరు కొట్టించానా...."

"......"

"యేంచేయను చెప్పండి ? వాడొచ్చేదాకా యేదో ఒకటి మాట్లాడాలి గదా

యిదిగో మీ అన్నయ్య...."

"మనూ!" సాగర్ కంఠం వినిపించింది.

"అన్నయ్యా!..."

"చిరంజీవి రాలేదా యింకా .."

"..........."

"యేమిటి మాట్లాడవ్ ?"

"నీకేం చెప్పాను ?"

"వో అదా ?" నవ్వుతూ అన్నాడు. "నీకు భర్తగాక మునుపటినుంచీ నాది తను ఫ్రెండ్. వొకసారిగా 'బావా' అని పిలవమంటే యెలా అలవాటు పడుతుంది చెప్పు ? వోకే. బావగారు యింటికి వేంచేశారా ?..."

"లేదింకా..."

"క్లబ్ కొస్తానని ప్రామిస్‌చేసి యెగ్గొట్టాడు. నేను వోడించేస్తానని భయ పడ్డాడు కాబోలు...."

"ఆయన డిక్షనరీలో భయం అన్న పదమేలేదు, తెలుసా ?"

"భలేభలే ! ఆరునెలల్కితం వరకూ మా చెల్లెలు యేమనేదో తెలుసా ? మా అన్నయ్య డిక్షనరీలో డిఫీట్ అన్నపదమే లేదు అనేది..."

మానసకూడా నవ్వేసింది.

"అమ్మా నాన్నా నన్నప్పుడే మరచిపోయారు." అంది.

"అదేమిటి? అలాగంటావు?

"మరేమంటాను ? యింటికొచ్చి అయిదురోజులు దాటింది. ఫోన్‌చేస్తే యివ్వాళ యిద్దరూ వస్తామన్నారు. చూసిచూసీ విసుగేసింది. కోపంవచ్చి ఫోన్ గూడా చేయలేదు నేను..."

"భలేదానివే, యేదో పని తగిలి వుంటుంది. బహుశా రేపటికి పోస్ట్‌పోన్ చేసుకుని వుంటారు. అన్నట్టు వొక యింపార్టెంటు మేటరుంది. చిరంజీవితో—అదే బావగారితో యింటికిరాగానే చెప్పు. సెవెన్‌హిల్స్ యెక్స్‌పోర్ట్సు వాళ్ళు కొటేషను నిన్ననే పంపారట. ఆ విషయమై మీ ఆయన వొకటే హైరానా పడిపోతున్నాడు. నిన్నటివరకూ నేను వాళ్ళదగ్గరికి వెళ్ళిరాలేదని గొడవచేశాడు. తీరా నేను వెళ్ళి వచ్చాక, నన్ను కలుసుకోకుండా యెక్కడో తిరుగుతున్నాడు. పెళ్ళిచేసుకున్నాడు గదా, తొందర తొందరగా సంపాదించేయాలి కాబోలు. యేమయినా అంటే 'బిజినెస్‌లో రేపు చేయాలి' అని పోస్ట్‌పోన్ చేయడం డ్రా బాక్ లెక్చర్ అంటూ దంచేస్తున్నాడు..."

"సెవెన్‌హిల్స్ యెక్స్‌పోర్ట్స్...వాళ్ళెవరు ?"

"అదంతా నీకిపుడు చెబితే అర్థంకాదు. మా ఫ్రెండు ఇదరిన్లా అందులో పనిచేస్తున్నాడు. వాళ్ళ దగ్గర కూచుని యీపని చేయించమని మీ ఆయన ఆర్డరు. నేను వొబేయింగ్...రాగానే చెప్పు ఆ పని అయిపోయిందని..."

"అలాగే...."

"యింకేమిటి? ఫోన్ వుంచేయనా ?"

"మీ ఫ్రెండు...."

"లోపలున్నాడు...."

"యేమిటంత అతిగా వాగుతాడు ?"

"యేమంటున్నాడు ?" నవ్వుతున్నాడు.

"నీకు నవ్వులాటగానే వుంటుంది. నేను మాట్లాడడం నేర్చుకుంటున్నానట ! సావాస దోషం అంటున్నాడు."

"నిజమే మరి !"

"అంటే....?"

మళ్ళీ నవ్వు.

"పెళ్ళికిముందు నాకు మాటలు రావా ?"

"యెవరన్నారు !"

"యేదో నీకూ ఆయనకూ స్నేహితుడుగదా, అని గౌరవంగా మాట్లాడితే మాటలు రావంటున్నాడు. రేపటినుంచి మాటకుమాట అనేస్తాను...."

"అంతకోపం తగదమ్మాయ్. బావగారు యింటికి ఆలస్యంగా వేంచేస్తు న్నారే అనుకో! అంతమాత్రాన ఆ కోపాన్ని చూపెట్టాల్సింది మాపైన్నా చెప్పు?"

"నిన్నూ...."

"ఫోన్‌బిల్లు పెరిగిపోతోంది...."

"నిన్నెవరు ఫోన్ చేయమన్నారు ? రేపు యింటికి రాకపోయావో అప్పుడు చెబుతాను నీపని...."

మానస రిసీవరును క్రెడిల్‌పైన పడేసింది.

అలాగే దిండునానుకుని పడకపైకి వాలిపోయింది.

కిటికీలోంచి చల్లటిగాలి వీస్తోంది.

మంచుగడ్డలాంటి యేకాంతాన్ని పదునైన చురకత్తితో కోస్తున్నట్లుగా టేప్ రికార్డర్‌లోంచి వీణానాదం వినిపిస్తోంది. విషాదంతో కూడిన తీయదనం...ఎప్పుడూ మానవుడు యేకాకిగానే మిగిలిపోతాడన్న విషయాన్ని చాటిచెబుతున్నట్టుగా గుబులు గుబులుగా మ్రోగుతుంది వీణ....

గోడ గడియారం ఠంగుమని మ్రోగింది.

వులిక్కిపడి లేచి టీపాయ్‌దగ్గరికి నడచి టేప్‌రికార్డరును ఆఫ్‌చేసింది. ట్రాన్సిస్టరును ఆన్ చేసింది.

తెలుగులో వార్తలు ప్రసారమవుతున్నాయి.

వార్తల్ని వినడంలో తన ధ్యాసను కేంద్రీకరించడంకోసం ప్రయత్నం చేసింది మానస.

లాభం లేకపోయింది.

చూపులు కిటికీని వదలిపెట్టడంలేదు.

విసుగ్గా ఫోన్ దగ్గరికి నడచి రిసీవర్ చేతికందుకుని ఫ్యాక్టరీనెంబరు డయల్ చేసింది.

అవతల రింగవుతోంది.

రెండు నిమిషాల తరువాత "హలో కే సీ యస్ మెడికల్స్...." అన్న కంఠం వినిపించింది.

"మీ ప్రొప్రయిటరుగారు...."

"లేరండీ గంట్కితమే వెళ్ళిపోయారు"

"యెక్కడికి ?"

"తెలియదండీ—మీరెవరు ?"

మానస బటన్‌నొక్కి లైను డిస్కనెక్టు చేసేసింది.

ఆఫీసులోలేదు.

చిరంజీవి మరెక్కడికెళ్ళినట్టు ?

రిక్రియేషన్ క్లబ్బుకు రింగ్ చేసింది.

అటెండరు యెవరు కావాలంటూ ప్రశ్నించాడు.

చదరంగం ఆడుకుంటూ కూచున్న సాగర్, టెలిఫోను దగ్గరికి రావడానికి రెండుమూడు నిమిషాలు పట్టింది.

ముళ్ళపైన నిల్చున్నట్టే వుంది ఆమెకు.

"యేంచేస్తున్నావింతసేపూ ? లైన్‌లో యెంతసేపని వెయిట్ చేయాలి ?" విసుక్కుంది.

"బయట లాన్‌లో కూచున్నాను. లోపలికి లేచి రావాలిగదా ! రేపటినుంచీ, ఫోన్‌ను చెస్‌బోర్డు దగ్గరే అరేంజ్‌చేయమని చెబుతాను క్లబ్బువాళ్ళతో. అదిసరే

యేమిటి విశేషం?"

"మీ బావగారిక్కడికి వచ్చారేమోనని...."

"రాలేదని చెప్పానుగదా!

"క్లబ్ కొస్తానని ప్రామిస్ చేశారని చెప్పావుగదా!"

"అవును...."

"ఫ్యాక్టరీకి ఫోన్ చేశాను. గంట క్రితమే వెళ్ళిపోయారని చెప్పారు. నువు ఫోన్ చేశాక అక్కడి కొచ్చారేమోనని...."

"రాలేదు, బహుశా మరెక్కడికయినా వెళ్తుంటాడు. చెప్పానుగదా, మీ ఆయనకు డబ్బుపిచ్చి పట్టుకుంది. ఏ పార్టీదగ్గరకు పరుగెట్టుకెళ్లాడో యేమో! వచ్చేస్తాడ్లే ఏమయినా ప్రోగ్రాం ఫిక్స్ చేసుకున్నారా మీరు?..."

"సినిమాకెళ్దామన్నారు. మామూలుగా ఆరిందికంతా యింటికొచ్చేసేవారు. యేడున్నరయింది. యింకా రాలేదు. కంగారుగావుంది...."

"కంగారెందుకు? బయటి కెళ్ళాక యెన్నో పనులు. యిది మామూలే.... యిలా కంగారు పడడం మొదలు పెడితే యిక అయినట్టే...."

"యేమో అన్నయ్యా. నాకు భయంగావుంది...." ఆమె కంఠం వణికింది.

"యేయ్ పిచ్చిపిల్లా, యింత మాత్రానికే అలా కంగారు పడతా వెందుకు, యింతకూ నువ్వెక్కడినుంచీ మాట్లాడుతున్నావు?"

"యింటి దగ్గిరనుంచీ...."

"యింటి దగ్గరనుంచీ మాట్లాడుతున్నావన్న సంగతి నాకూ తెలుసు. హాల్లోనా; కిచెన్‌లోనా, మేడపైనా?"

"మేడపైన్నుంచీ...."

"మీ అత్తగారు...."

"కిచెన్‌లో వున్నారు...."

"అదీ సంగతి. యిదిగో అమ్మాయ్, వొంటరిగా గదిలో కూచుంటే నీకిలాగే పిచ్చిపిచ్చి ఆలోచనలు వస్తాయి. నీకు పెళ్లిచేసింది, కేవలం మీ ఆయనకోసం యెదురుచూస్తూ కూచోడానికి వొకవ్యక్తి కావాలని మాత్రమేగాదు. మీ అత్తగారికి కాస్త సహాయం చేసిపెట్టే తోడుకావాలని గూడా....వెళ్లి వంటపని చూడు...."

"నీకు ఫోన్ చేసింది వుచిత సలహాలకోసంగాదు"

రిసీవర్ పడేసి, మేడ పైన్నుంచీ కిందికి దిగి, కిచెన్‌లోకి వెళ్లింది ఆమె సరోజమ్మ డైనింగ్ టేబులుపైన ప్లాత్రల్ని సర్దుతూ కనిపించింది.

"ఆయన యింకా రాలేదాండీ?"

ఆమె తలపైకెత్తి చూసింది.

"టయమెంతయిందిప్పుడు?"

"యేడున్నర...."

"అంతేగదా! వచ్చేస్తాడ్లే....బోర్‌గావుంటే టీ వీ ఆన్ చేసుకుని కూచో..".

"వంట..."

"యేమిటి, ఆకలిగావుందా?" సరోజమ్మ నవ్వుతూ ప్రశ్నించింది.

"అబ్బబ్బే, అదిగాదు. యేమయినా హెల్ప్...."

"వంటయిపోయింది. చిరంజీవి రాగానే వడ్డించడమొకటే నువ్వు చేయాల్సిన సహాయం...."

మానస హాల్లోని టీవీ మీటనొక్కి, యెదురుగా సోఫాలో కూర్చొంది.

వరినాట్ల గురించీ, పశుపోషణ గురించీ కార్యక్రమమేదో నడుస్తోంది

'తన భర్త యేడున్నర దాటుతున్నా యింటికి రాలేదు. అయినా అత్తగారు కంగారు పడడంలేదు. అన్నయ్య పట్టించుకోవడం లేదు. తాను మాత్రమే బెంబేలు పడిపోతోంది. యెందుకని?' పెళ్లిచూపుల నాటి తన వాగ్వాదం జ్ఞాపకం వచ్చింది ఆమెకు. 'పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయాలని పట్టుబట్టింది తాను. యిప్పుడిప్పుడే పెళ్లి చేసుకోను పొమ్మంది యింట్లో యెవరూ వొప్పుకోలేదు. అబ్బాయి బావున్నాడు. మంచి ఆస్తిపాస్తులున్నాయి. బాగా చదువుకున్నాడు. పైగా అన్నయ్యకు చాలా రోజులుగా స్నేహితుడు. బాగా తెలిసిన సంబంధం. అందరూ పట్టుబట్టి, బలవంతంగా వొప్పించి, పెళ్లికి ముహూర్తం నిర్ణయించారు. ఆ సంఘటన జరిగి యింకా యేడాదయినా గడవలేదు. ఆనాడు చిరంజీవి యెవడో పరాయివ్యక్తి. అతడుగాకపోతే మరెవరో వొకరు. చదువు పూర్తయ్యాక, నచ్చిన మరో వ్యక్తిని చేసుకుంటే సరిపోతుంది. ప్రపంచంలో మరో మొగాడే లేడా?- పోట్లాడింది తాను. కానీ యిప్పుడు? ప్రపంచంలో తన కింతగా యిష్టమయిన మరోవ్యక్తి యెవరున్నారు? లేరు. యెవడూలేడు. చిరంజీవి తన లక్ష్యం. చిరంజీవి తన గమ్యం. చిరంజీవి తన సర్వం. చిరంజీవే తనకు కావాలి. తానే అతను. అతనే తాను. యెంతలో యెంత మార్పు? టీ వీ సెట్టుపైన, ఫోటో ఫ్రేంలోంచీ తననే పలకరిస్తున్నాడు చిరంజీవి. అతని కళ్లల్లో మరెవరిలోనూ లేని వింతకాంతి....కొస దేలిన ముక్కు....పెదవులపైన అదే చిరునవ్వు.... యేదీ చిరంజీవి? యింకా రాడేమిటి?' మానస నిరీక్షణను భరించలేక పోతోంది.

సరోజమ్మ కూడా వంటగదిలోంచీ బయటపడి, టీ వీ ముందు కూర్చొంది

"ఆయనా, వాడూ బయటికెళ్తే, యిలా యెదురు - చూస్తూ కూచోవడం నాకు అలవాటే! యిప్పుడు నాకు తోడుగా నువ్వొచ్చావు...." ఆమె నవ్వుతోంది.

'మొదట్లో ఆమెకూడా తనలాగే కంగారు పడుతూ కాలంగడిపేదేమో! నిరీక్షించడం అలవాటు పడ్డాక, తనకు గూడా అలా నవ్వగలిగే శక్తి వస్తుంది కాబోలు....'

"డాక్టరు వొద్దని చెప్పాడుకాబట్టి, ఫ్యాక్టరీ కెళ్లడం మానేసి, యిలా ధ్యానం గీనం అంటూ రామకృష్ణ మందిరానికి వెళ్తున్నారుగానీ, ఆయన ఫ్యాక్టరీకెళ్లే రోజుల్లో నేనిలా గంటలకు గంటలు యెదురుచూస్తూ కూచునేదాన్ని. ఆయనతో పోలిస్తే చిరంజీవి యెంతోమేలు...."

హాల్లోని ఫోన్ మ్రోగింది.

పరుగెత్తుకెళ్లి, రిసీవర్ చేతికందుకొంది మానస.

వినిపించిన కంఠం చిరంజీవిది కాదు.

"చంద్రమౌళి గారి యిల్లేనా?"

"అవును...."

"నేను గవర్నమెంటు హాస్పిటల్ నుంచీ మాట్లాడుతున్నాను. అయామ్ వెరీ సారీ. బాడ్ న్యూస్ చెప్పాల్సి వస్తోంది. చంద్రమౌళి గారి అబ్బాయి, చిరంజీవికి ఆక్సిడెంటయింది. క్రాస్ రోడ్స్ దగ్గర కారు లారీని ఢీ కొట్టింది."

కెవ్వుమని కేకేసి నేలవాలిపోయింది మానస.

"స్పాట్ డెడ్....చిరంజీవి మరణించాడు.....మీరు వెంటనే రావాలి...."

చివరి మాటలు వినబడక మునుపే ఆమెకు స్పృహ తప్పిపోయింది.

## 2

"డోర్ లాక్ చేయమంటారా సార్?"

కుర్చీని కిటికీ వైపుకు తిప్పుకుని కూర్చుని యెటో చూస్తూవుండిపోయిన సాగర్ వులిక్కిపడి ప్యూన్ వైపుకు తిరిగి చూశాడు.

"అయిదయిపోయింది. డోర్ లాక్ చేయమంటారేమోనని...." మళ్లీ అడిగాడు అతను.

"నేను కాస్సేపు యిక్కడే వుంటాను. నువ్వెళ్లిపో. నేనే లాక్ చేసుకుంటాను...." అన్నాడు సాగర్.

ప్యూన్ వెళ్లిపోయాడు.

క్లాసులు సాయంకాలం నాలుగు గంటలకంతా అయిపోతాయి. ఆపైన డిపార్టుమెంటు దగ్గర జనసంచారం తగ్గిపోతుంది. తమతమ గదుల్ని లాక్ చేసు

కుని లెక్చరర్లందరూ వెళ్లిపోతారు.

యూనివర్సిటీ నగరానికి వొక చివర్లోవుంది. కాబట్టి ట్రాఫిక్ శబ్దాలు అంతగా వినిపించవు. ఆ సమయంలో - డిపార్టుమెంటు ముందున్న రోడ్డు పైన్నుంచీ లైబ్రరీ కెళ్లే విద్యార్థులూ, యూనివర్సిటీ లోపలే షికార్లు తిరిగే జంటలూ తప్ప మరెవరూ కనిపించరు.

కిటికీలోంచీ పెద్ద గానుగ చెట్టొకటి కనిపిస్తోంది.

చెట్టు కొమ్మపై చేరిన పిచ్చుకలు రెండు యెందుకో కీచులాడుకుంటున్నాయి.

పచ్చటి ఆకులు నేలపైకి రాలిపోతున్నాయి.

పండిపోయిన ఆకులు నేల రాలడంలో ఆశ్చర్యంలేదు.

అయితే లే చిగురాకు లెందుకు రాలిపోవాలి.

యెందుకు ?

యెందుకిలా జరిగింది.

యెందుకన్న ప్రశ్న సాగర్‌ను వేధిస్తోంది.

టేబుల్‌పైన చదవడం కోసమని తెరిచి పెట్టిన లైబ్రరీ పుస్తకం అలాగే వుండిపోయింది.

ఆష్ట్రేలోకి పారేసిన సిగరెట్టు ముక్క యింకా పొగల్నికక్కుతూనే వుంది

కుర్చీని మరి కొంచెం వెనక్కు లాగి, కాళ్లుకిటికీలో కెత్తిపెట్టుకుని, చేతుల్లో ముఖం దాచుకున్నాడు అతను.

కళ్లు ఎర్రబారిపోయాయి.

జుట్టు రేగిపోయివుంది.

చెక్కిళ్లపైన, అయస్కాంతాన్ని అంటిపెట్టుకున్న యినుపరజనులా, వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

అతను బట్టలు మార్చుకుని మూడునాలుగు రోజులు దాటిపోయివుంటుంది.

దుమ్మును పైకి లేపుతూ, యీదురుగాలి కొరడాను ఝుళిపించింది.

టేబులుపైని పుస్తకం పేజీలు టపటపాకొట్టుకున్నాయి.

విసుగ్గా పుస్తకాన్ని మూసిపెట్టాడు.

అట్టపైన యెవడోకుర్రాడు యిష్టమొచ్చినట్టుగా పిచ్చిగీతల్ని గీసిపారేశాడు.

జీవితం కూడా పిచ్చిగీతల సముదాయమే కాబోలు ననిపించింది అతడికి.

పుస్తకం తన స్వంతంకాదు. దాన్ని యెలా పాడు చేసినా తన సొమ్మేమీపోదు. పిచ్చిగీతలుగీసి పారేసిన తరువాత, ఆ కుర్రాడు నవ్వుకొని వుంటాడు.

మానవ జీవితాల్ని కసిగా చిందరవందర చేసిపారేసే కసాయివాడు యెవడు ?

యెవ్వడువాడు ?

యెందున్నాడు ?

ఆ వ్యక్తి యెవడోగానీ, అతడు తనకెదురైతే ఖూనీ చేసి పారేయాలి—అనిపిస్తోంది అతడికి.

సిగరెట్టుకోసం డ్రా తెరిచాడు,

ప్యాకెట్టులో సిగరెట్లు లేవు.

అతను చైన్ స్మోకర్ గాడు. యేమీ తోచనప్పుడు రోజుకొకటి రెండు సిగరెట్లుకాల్చుకోవడం అతడి అలవాటు. కానీ ఆరోజున అతడు కొనుక్కొచ్చిన సిగరెట్టుప్యాకెట్టు సాయంకాలానికంతా ఖాళీ అయిపోయింది.

ఆ రోజు సాగర్ కాలేజీకి రావల్సిన అవసరంలేదు.

అయినా, యింట్లో కూచోబుద్ధికాలేదు.

క్లబ్బు కెళ్ళడానికి మనస్కరించలేదు.

పదకొండు గంటలవరకూ వొళ్ళలసిపోయేలా వూరు తిరిగి, తరువాత కాలేజీకొచ్చి, తన గదిలో కూచున్నాడు.

యిద్దరు ముగ్గురు తోటి లెక్చరర్లు గదిలోకొచ్చి, సానుభూతిమాటలుచెప్పి, వెళ్ళిపోయారు.

యెందుకో, యెవరితోనూ మాట్లాడాలని అనిపించడంలేదు అతడికి.

వొంటరిగా అలాగే కూర్చుని వుండిపోయాడు.

· మధ్యాహ్నం భోజనం చేయలేదు.

ఆకలికూడా కాలేదు.

టేబుల్‌పైని నీలిరంగు గ్లాసులో వూదారంగు పౌంటెన్‌పెన్ మిగిలిన కలాల్ని వెక్కిరిస్తున్నట్టుగా మెరుస్తోంది.

'అది తనకు మానస మదరాసునుంచీ తీసుకొచ్చిన బహుమతి. తనకు బాగా జ్ఞాపకముంది' డిగ్రీ ఫైనల్ యియర్లో మదరాసుకు టూరు కెళ్ళింది మానస. వస్తూ వస్తూ యింట్లో అందరికీ బహుమతులు కొనుక్కొచ్చింది. నీకేం తెచ్చుకున్నావని తానడిగితే ఠాగూరు 'గీతాంజలి'ని నూపెట్టింది. యెమ్మేలో యింగ్లీషు లిటరేచర్' చదవాలని కలలుగనేది తాను. మంచి పుస్తకమేదయినా కనిపిస్తే యేదో పెన్నిధి దొరికినట్టు సంబరపడిపోయేది. యీ పెళ్ళికి బదులు యెమ్మేలో చేర్పించినా సరిపోయేది. యీ మూన్నాళ్ళ ముచ్చటకేనా అందరూ బలవంతపెట్టి పెళ్ళిచేసింది?'

దీర్ఘంగా నిట్టూర్చాడు అతను.

'యెవరినో నిందించి లాభంలేదు. దీనికంతా తన తొందరపాటే కారణం. చిరంజీవిని యింటికి రమ్మని ఆహ్వానించిందీ తానే! పెళ్ళిచూపులు యేర్పాటు చేసిందీ తానే! మానసను బలవంతపెట్టిందీ తానే యిలా జరిగినందుకు కారకుడెవడో వేరొకడని అనుకుంటున్నాడు తాను. ఆ కిరాతకుడు మరెవడోకాడు తానే!'

సాగర్‌కు జుట్టు పీకేసుకోవాలనివుంది.

కసిగా తనను తానే శిక్షించుకోవాలనివుంది.

విసురుగా గోడకేసి కాలు విదిలించాడు.

గోరుచిట్లి, రక్తం బొటబొటా కారింది

కళ్ళలో నీళ్ళుతిరిగాయి.

అలాగేవంగి, వ్రేలును చూస్తూ కూర్చున్నాడు.

వ్రేలు నొప్పిగావుంది.

బిగ్గరగా యేడవాలనిపించింది అతడికి.

వాష్‌బేసిన్ దగ్గరికివెళ్ళి, చేతిగుడ్డను తడిపి, వ్రేలికి చుట్టాడు.

మళ్ళీవచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

బయట చీకటితెరలు విడివడుతున్నాయి.

గదిలో బాగా చీకటిగావుంది.

గంటెంతయిందో తెలుసుకోవడంకోసం ముంజేయికేసి చూశాడు.

గడియారంలేదు.

వుదయం బయలుదేరినప్పుడు రిస్ట్ వాచ్ తీసుకోవడం మరచిపోయాడు తాను.

కిటికీ కవతల కానుగ చెట్టుపైన పక్షుల సంరంభం బిగ్గరిగా వినిపిస్తోంది.

లైబ్రరీనుంచీ హాస్టలుకెళ్తున్న విద్యార్థినులు యెందుకో బిగ్గరగా నవ్వుకుంటున్నారు

సాగర్ కాస్సేపు బాహ్య ప్రపంచాన్ని మరచిపోయి, సుషుప్తిలో వుండి

పోయాడు.

కుర్చీలోనే సోలిపోయాడు.

వున్నట్టుండి గదిలో దీపం వెలిగింది.

సాగర్ తిరిగి చూశాడు.

యెదురుగా రాజేష్ కనిపించాడు.

సూటిగా తనవైపే చూస్తున్నాడు.

సాగర్ తలవంచుకున్నాడు.

రాజేష్ యెదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

యిద్దరూ యేమీ మాట్లాడుకోలేదు.

కాస్సేపు గడచాక "వెళ్దాం, పైకిలే" అన్నాడు రాజేష్.

రాజేష్ టేబుల్‌పైని కీ బంచ్ చేతికందుకుని, తానే గదికి తాళం తగిలించాడు.

డిపార్టుమెంటు ముందుకు రాగానే "బైక్ కూడా తీసుకురాలేదన్నమాట!" అన్నాడు.

సాగర్ సమాధానం చెప్పలేదు.

తన మోటారు బైకును స్టార్టుచేశాడు రాజేష్.

సాగర్ వెనక సీటుపైన కూర్చున్నాడు.

దాదాపు నిర్మానుష్యంగా మారిపోయిన యూనివర్శిటీ రోడ్లను దాటుకుని, మోటారుబైకు నగరంలోకి ప్రవేశించింది.

రాజేష్ ముందుగా వో హోటలుకు తీసుకు వెళ్ళాడు.

టిఫెన్‌కూ, కాఫీకీ ఆర్డరిచ్చాడు.

సాగర్ బుద్ధిగా టిఫెన్ చేశాడు.

తరువాత మళ్ళీ మోటార్‌బైక్ బయల్దేరింది.

"క్లబ్బుకొద్దు...." అన్నాడు సాగర్.

"మరి ?...."

"యెక్కడి కయినా వెళ్దాం....యెవరూ లేని చోటికి...."

"బీచ్ కెళ్దామా ?...."

"అలాగే...."

బీచ్ దగ్గరికెళ్లేసరికి గంట యెనిమిది దాటివుంటుంది.

సముద్రంలో అలలు వువ్వెత్తున లేచి పడుతున్నాయి.

కెరటాలు విసిరికొడుతున్నా, చందమామ సముద్రాన్ని అంటిపెట్టుకునే వున్నాడు.

బీచ్ నిర్మానుష్యంగా వుంది.

మోటర్ బైకుని రోడ్డుపక్కన నిలబెట్టి, "యిక్కడే కూచుందాం" అన్నాడు రాజేష్.

"సిగరెట్ వుందా ?" కూచుంటూ అడిగాడు సాగర్.

జేబులోంచీ సిగరెట్టు ప్యాకెట్టునూ, సిగర్‌లైటర్‌నూ పైకితీసి అతడికిచ్చాడు రాజేష్.

సిగరెట్టు వెలిగించుకున్నాక, సాగర్ అలాగే యిసుకతిన్నెపైన పడుకున్నాడు.

తానూ సిగరెట్టు వెలిగించుకున్నాక, "వుదయంనుంచీ యూనివర్శిటీలోనే వున్నావా ?" అంటూ ప్రశ్నించాడు రాజేష్.

"లేదు....పదకొండున్నర నుంచీ వున్నాను...."

"అంతవరకూ ?"

"అలా తిరిగాను"

"యింట్లో చెప్పావా ?"

"వూహూ" మూల్గుతున్నట్టుగా వూకొట్టాడు.

"ఫోన్ చేశావా ?"

"లేదు...."

"యెందుకని ?"

"యేమో, తోచలేదు ..."

"మధ్యాహ్నం భోంచేశావా ?"

"..... ... ...."

"పోనీ, నేను యూనివర్శిటీకి ఫోన్‌చేశాను. ఆసంగతయినా తెలుసానీకు?"

సాగర్ మిత్రుడివైపుకు తలతిప్పిచూశాడు. "ప్యూన్ చెప్పాడు. యెవరో అడిగారని చెప్పాడు. నువ్వేనని తెలియదు."

"మధ్యాహ్నం మీ నాన్నగారు మా ఆఫీసుకు ఫోన్‌చేశారు...."

"..............."

"యెందుకని అడగవేం ?"

"చెప్పు...."

"ప్రొద్దున్ననగా యిల్లొదిలిపెట్టిన వాడివి. యేమయిపోయావో యేమో....నన్నడిగితేనయినా తెలుస్తుందేమోనని...."

"నేనా ? నేనెక్కడికెళ్తాను ?.... నేనేమైపోతానని....?" నిట్టూర్చాడు.

"యేమో, నీ ధోరణి చూస్తుంటే నాగ్గూడా భయంగానే వుంది....."

నేనేంచేస్తున్నాను ?" అతడి కంఠం జీరబోయింది.

"నువ్వేం చేస్తున్నావో, నీకే తెలియదన్న మాట ! నువ్వు యెవరితోనయినా పట్టుమని పదిమాటలు మాట్లాడి యెన్నాళ్లయింది ? వేళకు భోంచేస్తున్నావా నువ్వు ? యింట్లో వుంటున్నావా ? యెందుకిలా యింటినుంచీ దూరంగా పారిపోతున్నావు ? పిచ్చివాడిలా తిరుగుతున్నావెందుకు ? మీ అమ్మా నాన్నా యెంత బాధపడుతున్నారో నువ్వసలు గమనిస్తున్నావా ? కూతురి బ్రతుకేమో అలాగైపోయింది. నువ్వేమో యిలా తయారై కూచున్నావు. యెంతటి వాళ్లకయినా గుండెలు నీళ్లయిపోతాయి..."

"..........."

"యిటువంటి పరిస్థితిలోనే మనం ధైర్యంగా, స్థయిర్యంగా వుండాలి సాగర్ ! పారిపోకూడదు. యెదిరించి నిలబడాలి..."

"నిజమేకానీ....రాజూ !"

"యేమిటో చెప్పు."

"యిలా జరగడానికి కారణమెవరో తెలుసా నీకు ?"

"యెవరు ?"

"నేనే !"

రాజేష్ వులిక్కిపడ్డాడు.

"నువ్వా ?"

"అవును, నేనే !"

"యేం చేశావు నువ్వు ?"

"పెళ్లికి ముందు యింట్లో యెంత గొడవ జరిగిందో నీకేం తెలుసు ? చెల్లాయి యిప్పుడిప్పుడే పెళ్లిచేసుకోనని మొండి కేసుకుని కూర్చొంది. అమ్మా నాన్నా గూడా అటువైపుకే మొగ్గుతున్నట్టుగా కనిపించారు. నేను....నేను ససేమిరా కుదరదని నానాహైరానా చేసిపారేశాను. యింతమంచి సంబంధం పోతేరాదని గిరిగీసుకుని కూచున్నాను...." యేడుపు జీరతో అతడి కంఠం అదోలా వినిపిస్తోంది. "మా అమ్మకూ, నాన్నకూ నామాట ప్రకారం పెళ్లి జరిగితే బావుండుననివుంది. మానస యిష్టప్రకారం చదివించాలనీ వుంది. మంచి

సంబంధం. తప్పిపోవడం వాళ్లకూ యిష్టంలేదు. అప్పుడు... దెన్ యిటీజ్ మీ హూప్లెయిడ్ దీ డబుల్ గేమ్..."

"అంటే...."

"అంటే...."

"చెల్లెలికిష్టమేనని చిరంజీవికి చెప్పాను. పెళ్లి జరిగి తీరాలని యింట్లో మొరాయించాను. నేను మూర్ఖుణ్ణి రాజూ ! పెళ్లయ్యేదాకా వొంటికాలిమీద నిలబడ్డాను. లేకుంటే ... లేకుంటే.... భగవంతుడా!.... ఐఅయామ్ యే డెవిల్" సిగరెట్టువిసిరి పారేసి, లేచికూచున్నాడు.

రాజేష్ అతడివైపే కన్నార్పకుండా చూడసాగాడు.

"యితరుల జీవితాల్తో ఆడుకోవడానికి నేనెవడ్నిరాజూ !" గొంతు జీర బోవడంతో సగంమాటమాత్రమే వినిపించాయి.

"నిజమేసాగర్ ! నీ అంత మూర్ఖుడు మరొకడుండడు..." అన్నాడు రాజేష్.

"ఆ వొక్క తిట్టు చాలదునాకు.... తిట్టురాజూ ! యీలోకంలో అతినీచ మయిన తిట్లన్నీ తిట్టు....యెంత తిట్టినా నాపాపానికి నిష్కృతి వుండదు...."

"నిన్నేమని తిట్టాలో తోచడంలేదు సాగర్ ! నిజంగా నీ అంత ఫూల్ మరొకడుండడు. కానీ నిన్ను తిట్టడానికంటే ముందుగా మీ అమ్మా నాన్నల్ని తిట్టాలి.... "

"వాళ్లేం చేశార్రా" సాగర్ చిరాకు పడ్డాడు.

"అసలు దీనికంతా వాళ్లే కారణం. పిల్లల్నసలు కనకుండా వుంటే, యిన్ని బాధలు వుండేవి కావు. పోనీ నీ వొక్కడితో సంతృప్తి పడివున్నా పరవాలేదు. మీ చెల్లాయి పుట్టకపోయినట్టయితే, యిక సమస్యే లేదు ...."

"రాజా ! ... " సాగర్కేం చెప్పాలో తోచలేదు.

"లేకపోతే నువ్వనేదేమిటి? చెప్పు? బలవంతంగా పెళ్ళిచేశానంటున్నావు. అందుకని తప్పంతా నీదేనంటున్నావ్. అంతేనా ? ...."

"........"

"పిచ్చివాడా ! అది మంచి సంబంధం. వాడు నీకు స్నేహితుడు. బిజినెస్లో పైకొస్తున్నవాడు. చెల్లెలు సుఖపడుతుందని అనుకున్నావు. మంచే జరుగుతుందని భావించావు. యింతలో యిలా జరుగుతుందని యెవరు కలగన్నారు ? — "

"........"

"యిలా జరగడానికి అసలు కారణమేమిటో నీకు తెలియదు. కానీ నాకు తెలుసు. యేమిటో తెలుసా అది ?"

సాగర్ సమాధానం చెప్పలేదు.

"దీనికి కారణం యింకొకరెవరూ కాదు. చిరంజీవే కారణం. కన్నూ మిన్నూ కానకుండా తాగేసి డ్రయివ్ చేస్తే యేమవుతుంది సాగర్ ? పాపం, తాగాడు గదా అని, వెహికల్స్ తప్పుకుని తిరుగుతాయా ? .... "

"రాజూ, ఏమిటి నువ్వంటున్నది ? నిజమే చెబుతున్నావా ? "

"అవును పోస్టుమార్టం జరగడం పరువు తక్కువని మీ మామగారు తన తంటాలు తాను పడ్డాడు, లేకపోతే, యీసరికి నిజం బయటపడి వుండేది."

"........"

"ఆరోజు రాత్రి బ్లూమూన్లో యేదో సెలబ్రేషన్ జరిగిందట !' స్నేహితుడెవకో డ్రైవరుకు కబురు చేయమని సలహా యిచ్చాడట గూడా !

మృత్యువు పిలుస్తుంటే యెవరి మాటలైనా వినబుద్ధవుతుందా చెప్పు ! కావలిస్తే యింకో సీసా ఖాళీ చేసి, ఆపైన యెంచక్కా డ్రయివ్ చేస్తానని పందెం కాశాడట మహానుభావుడు ...."

"........"

"నిజానికి యీరోజుల్లో తాగడం నేరం కాదు సాగర్ ! ఆమాటకొస్తే మనం తాగలేదూ ! యెన్నిసార్లు పార్టీలు చేసుకోలేదు మనం ? తాగి, డ్రయివ్ చేస్తున్న వాళ్ళంతా చచ్చిపోతున్నారా ? బీచీలో కూచుని బీరు బాటిళ్ళు ఖాళీ చేసి, వొకే స్కూటరెక్కి యెన్నిసార్లు యిల్లుచేరలేదు మనం ? కాస్త ఆలోచించి చూడు. కారణం నీది గాదు, చిరంజీవిదీ గాదు. ఆమాటకొస్తే తాగుడుదీ గాదు. తాగకుండా, డ్రైవ్చేస్తూ ప్రాణాలు పోగొట్టుకొన్న వాళ్ళు యెందరు లేరు ?....'

"........"

"యెందుకిలా జరిగింది ? దీనికి కారణమెవరు ? యిలాంటివన్నీ సమాధానం దొరకని ప్రశ్నలు. జవాబు చెప్పలేని ప్రశ్నలతో మనస్సును పాడుచేసుకోవడమెందుకు ? .... "

"........"


"సాగర్ నువ్వూ ఫిలాసఫీ చదువుకున్నావు. జీవితం అంటే నీకూ తెలుసు. సిల్లీ యిటీజిట్ సెల్ఫ్ యెనాక్సిడెంట్ ... బుద్ధిమంతుడైన వాడెవ్వడూ, ఇలాంటి కొశ్చన్స్తో జీవితాన్ని పాడుచేసుకోడు ....".


"మరి .... ? "

"నీకూ తెలుసు, నీతులు చెప్పడం సులభం. తనదాకా వస్తేగాని తెలియదు యెవరికయినా.... మీ సిస్టర్కిలా జరిగినందుకు , షాక్తో బెంబేలు పడిపోతున్నావు ... "

"......"

"యిక ఆపాడు ప్రశ్నల్ని వదలిపెట్టి, యికపైన యేంచేయాలో ఆలో



# తొలి ఉషస్సు తూరుపును తడిపిన వేళ

సత్తిబాబు

కనుకొలకుల్లో ఓ కన్నీటి కణం తారట్లాడే వేళ
ప్రశ్నతో ముఖాన్ని స్పృశిస్తూ గాలి పెడ్తోంది ఊళ
ఆ బిందువు చెప్పేగాథ ఎవ్వరిది-
చరిత్రకెక్కని ఆ బాధ ఎక్కడిది-

ఓ అనంత నీలాకాశమా—!
అంతకంతకూ దూరమవ్వడం నీ కలవాటు
అందుతావని ఎత్తుకెక్కడం నా పొరపాటు-
ఇసుకపర్రలో నడలిన అడుగు తడబడే వేళ
హోరు జోరుగ ఊగిసలాడి పాడ్తోంది జోల
భోరు మంటోంది ఆ హోరు ఎందుకని-
గోడు మంటోంది ఈ గుండె దేనికని-

ఓ అనంత నీలి సంద్రమా—!
దాచుకున్న గుబులు కెలకడం నీ కలవాటు
దాహమేస్తే నిన్ను చేరడం నా పొరపాటు-

తొలి ఉషస్సు తూరుపును తడిపినవేళ
గుండె పట్టుకు గుమ్మంలో పడుంటినిలా
వాకిలి తెరచిన లోగిలి ఎవ్వరిది-
లోగిలి చూపిన లాలన ఎక్కడిది-

ఓ అనంత కారుణ్యమా—!
జాలిపెంచుకు ఆదరించడం నీ కలవాటు
కాని భరించక పారిపోతే నా పొరపాటు-
ఆకులదోసిళ్ళు మంచుకణాల్ని తర్పణం చేసేవేళ
ఆశలపందిళ్ళు గాలి నొరుసుకుంటే హిందోళ
చేయందించిన నేస్తం ఎక్కడికి-
చెపితే వస్తా నీతో అక్కడికి-

ఓ అనంత సహృదయమా—!
క్షణం క్షణం బ్రతికించడం నీ కలవాటు
ఆ క్షణమే నాదంటే కాదనడం పొరపాటు-

---

చించు ..."

"నేనా ? ... యేంచేయాలి ?"

"ఆ సంగతి నాకు మాత్రం యెలా తెలుస్తుంది ? నీకే తెలియాలి. చని పోయిన వాళ్ల సంగతి వదిలేయ్. బ్రతికినవాళ్లసంగతి ఆలోచించు ..."

"......"

"జీవితం యెందుకు జవాబొక్కటే ... జీవించడానికి. జీవితాన్నే ఆక్సి డెంటని అనుకొన్నప్పుడు, యిప్పుడు జరిగింది యేమంత పెద్ద ఆక్సిడెంటు కాదు. ఆక్సిడెంటయిన జీవితాన్నే అనుభూతుల్నీ, అనుభవాల్నీ సంపాదించుకునే మజిలీగా భావిస్తున్నప్పుడు, యీ చిన్న యెదురు దెబ్బని మాత్రం యెందుకు లెక్క పెట్టాలి ?... "

రాజేష్ మరో సిగరెట్టు వెలిగించుకున్నాడు

భూమిని కదిలించడం కోసమన్నట్టుగా కెరటాలు ముందుకు దుముకుతూనే వున్నాయి. బాగా దూరమై పోయిన చంద్రుడిపై పగతీర్చుకోలేక, అతడి నీడను పొడుగ్గా సాగదీస్తున్నాయి.

రోడ్డుపైన లారీ వొకటి కర్ణ కఠోరంగా శబ్దంచేస్తూ దూసుకుపోయింది.

కొసవరకూ కాలిన సిగరెట్టు చురుక్కుమని వ్రేళ్ళను ముద్దుపెట్టుకొంది.

"వెళ్దామా", అడిగాడు రాజేష్.

నేనింకాస్సేపు వుంటాను. కావలిస్తే నువ్వెళ్ల ...." అన్నాడు సాగర్.

"అదే వద్దంది. లేపైకి " అతడి చేయిపట్టుకుని బలవంతంగా లేపి కూచో బెట్టాడు.

"నీకు తెలియదు రాజూ ! యిల్లంతా వల్లకాడుగా తయారయింది. నేను భరించలేను ... "

పారిపోయి సాధించేదేమీ లేదు రాపోదాం. యీసమయంలో వాళ్లందరినీ వోదార్చాల్సిన బాధ్యత నీపైనే వుంది. "

మోటారుబైకు స్టార్టయింది.

నగరంలో హడావుడి యింకా తగ్గలేదు.

మాకు రాత్రిపూటే బావుంది లెమ్మన్నట్టుగా బజార్లనిండా అంగళ్లు రంగు రంగుల దీపాల్ని అలంకరించు కున్నాయి.

కాలనీ వీధుల్లో మాత్రం రద్దీ తగ్గింది.

యింటి ముందు బైక్ ఆపుతూ, యేమిట్రా సాగర్ ... ఇల్లు తాళం వేసి వుందేమిటి ? అంటూ ప్రశ్నించాడు రాజేష్ కంగారుపడుతూ.

సాగర్ వెనకసీట్లోంచీ కిందికి దూకాడు.

పొరుగింటి అబ్బాయి దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు.

"అక్కయ్యను హాస్పిటల్లో చేర్చారు. అంకుల్, ఆంటీ అక్కడే వున్నారు మీరు రాగానే చెప్పమన్నారు .. "

"యే హాస్పిటల్ ? రాజేష్ అడిగాడు.

"ప్రశాంతీ నర్సిగ్ హోమ్ ... "

మోటార్‌బైక్ వెనక్కు తిరిగి, నర్సింగ్ హోమ్ వైపుకు దౌడు తీసింది.

(ఇంకావుంది)